# క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
30-6-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 98

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

ఓపిక, నిలకడ శక్తితో చేపట్టిన పనులు పూర్తి చేయాలి

వీబీఐటీలో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లెవ్‌లో నితిన్ నబీ

వర్చువల్‌గా పలు జిల్లాల కార్యాలయాలు ప్రారంభం

తెలంగాణలో బిజెపి అధికారానికి ఎంతో దూరం లేదని వ్యాఖ్య



2లో

## కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం



వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలున్నాయ్

పాత విధానంలోనే 75 శాతం కాంపోనెంటట్ కొనసాగించాలి

60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు

గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశంలో సీతకక్క స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి




## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలి

రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలి

ప్రారంభానికి ప్రధాని మోడీకి ఆహ్వానం

నిర్మాణ సంస్థలతో సిఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి,(క్రైమ్ మిర్రర్)**

యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు.

రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం

- మిగతా 2వ పేజీలో

# రైతు ఆశీర్వాద సభ వాయిదా

రైతు భరోసా పంపిణీ తరువాత రైతు ఆశీర్వాద సభ

వరుణుడు కూడా కరుణించడం ఆనందదాయకం


డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మం,(క్రైమ్ మిర్రర్):**

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కూడా కరుణించడాని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భారీ వర్షాల కారణంగా ఈ నెల 30న తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని ఆయన చెప్పుకొచ్చారు.

ఈ కారణం వల్ల రైతులకి ప్రజలకి కాంగ్రెస్ కార్యకర్తలకి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్న ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు ఆయన చెప్పుకుచ్చారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో



## విపరీతంగా పెరిగిన పాతబంగారం అమ్మకాలు

ధరలు పడిపోతాయన్న ఆందోళనలతో విక్రయాలు

మిగతా 2లో



## నగరంలో స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

వచ్చే అసెంబ్లీకి ఇప్పటి నుంచే కసరత్తు

పార్టీ శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపు


## తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం

ఇరు సంస్కృతుల వైభవాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వేదికగా హైదరాబాద్

భారత్‌లో కే-డ్రామాల ఆదరణతో సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం

కళా-సాంస్కృతిక భాగస్వామ్యానికి ప్రాధాన్యం: మంత్రి జూపల్లి



3లో

మిగతా 2లో



## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో మంత్రి లోకేశ్

టెన్త్, ఇంటర్ షైనింగ్ స్టార్లకు నగదు పురస్కారాలు అందచేత

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులే విద్యా వ్యవస్థకు బ్రాండ్ అంబాసిడర్లని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమంలో ఆయన పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు.



## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

ప్రజలు ఐదేళ్లకు తీర్పునిచ్చారు- ఎందుకు అసెంబ్లీని రద్దు చేయాలి

ప్రతి ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ప్రజలు శిక్ష వేస్తూనే ఉన్నారు

బిజేపిది ఆశకాదు.. అత్యాశ

రైతు భరోసా నిధులు వారంరోజుల్లో జమచేస్తాం

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరుచూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల

# విపరీతంగా పెరిగిన పాతబంగారం అమ్మకాలు

(మొదటి పేజీ తరువాయి)

**ముంబై, (క్రైమ్ మిర్రర్):** బంగారాన్ని ఆభరణంగా ధరించేందుకు కొనుగోలు చేసేవారు కొందరైతే.. పెట్టుబడి సాధనంగా భావించి కొనేవారు ఇంకొందరు. ఇలా పెట్టుబడి పెట్టిన వారికి పసిడి ఇటీవల కాలంలో 'కనక వర్షం' కురిపించింది. గడిచిన కొద్దిరోజులుగా పుత్తడి ధర దిద్దుబాటుకు లోనవు తోంది. మరింత పతనం అవుతుందన్న భయాలూ నెలకొన్నాయి. బంగారం కొనుగోళ్లను నిరాశ పరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఊతమిచ్చినట్లు అవుతుంది.దీంతో కొందరు తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానిమోడీ కూడా బంగారం కొనవద్దని హెచ్చరించారు. ఈ క్రమంలో తమ లాకర్లలో మూలుగుతున్న బంగారాన్ని నగదుగా మార్చుకుంటున్నారని సమాచారం. ఇంకా ధర పడిపోతే ఆ మేర లాభాన్ని కోల్పోతామని భావించి విక్రయాలకు దిగుతున్నారు. ఇండియా బులియన్, జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం.. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయ కుటుంబాలు 50 టన్నుల



బంగారాన్ని విక్రయించినట్లు తేలింది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 43 శాతం అధికం. అంతర్జాతీయ పరిణామాలతో గడిచిన ఏడాదిగా ఆకాశమే హద్దుగా పెరిగిన పసిడి ధర.. గత కొన్నివారాలుగా తగ్గుముఖం పడుతుండడం తో లాభాల స్వీకరణకు దిగుతున్నారు. ఇంతకుమించి పెరగకపోవచ్చన్న అంచనాలే దీనికి కారణమని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో రూ.10 గ్రాముల బంగారం ధర రూ.1.20 లక్షల మార్కుకు పడిపోవచ్చన్న అంచనాలతో తమ వద్ద ఉన్న బంగారాన్ని, పసిడి ఆభరణాలను నగదుగా మార్చుకుంటున్నారంటూ ఎకనమిక్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో పసిడి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అమెరికా, ఇరాన్ మధ్య తాజా ఘర్షణలతో క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరిగాయి. దీనికితోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలు బంగారం ధరల పతనానికి కారణమయ్యాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే సాధారణంగా పసిడిపై పెట్టుబడులు క్షీణిస్తాయి. బంగారం ఇలా లాకర్ల నుంచి మార్కెట్‌లోకి రావడం వల్ల ఓ విధంగా భారత్‌కు మేలే. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 30వేల టన్నుల పసిడి ఉందనేది అంచనా. అయినా ఇప్పటికీ పెద్దఎత్తున బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇలా పాత బంగారం మార్కెట్‌లోకి రావడం వల్ల పసిడి రీసైక్లింగ్ ఇండస్ట్రీకి ప్రయోజనం చేకూరుతుంది. 2025లో 125-150 టన్నుల బంగారం మార్కెట్‌లోకి రాగా.. ప్రస్తుత ట్రెండ్ ఇలానే కొనసాగితే 200-250 టన్నుల బంగారం వస్తుందనేది అంచనా. ఇదే జరిగితే ఆ మేర పసిడి దిగుమతుల బిల్లు తగ్గుముఖం పడుతుంది.

## రైతు ఆశీర్వాద సభ వాయిదా

ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం అందరికీ ఇబ్బందికరంగా ఉంటుందని అన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వర్షాలు తగ్గిన తరువాత వాతావరణ శాఖ నివేదికలను అనుసరించి ముఖ్యమంత్రి, కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు. సభ నిర్వహణ తేదీలపై ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే వాతావరణ శాఖ నుంచి వారం రోజుల ముందస్తు అంచనాలను తీసుకుంటుందని ఆయన అన్నారు. జులై నెల 3, 4 తేదీల వరకు వర్షాలు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసేందుకు మరో వారం రోజుల వాతావరణ సమాచారాన్ని సేకరించాలని ఆదేశించాం. వాతావరణ పరిస్థితిని బట్టి ఈ సభను వచ్చే 6, 7 లేదా 8వ తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సత్తెపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయిలతో పాటు జిల్లాలోని శాసనసభ్యులంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఉన్న మిగతా ఎమ్మెల్యేలు, ప్రజలు, రైతాంగ సోదరులు ఈ సభకు తరలిరావడానికి భారీ ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, ప్రజలు ఊహించని రీతిలో ఈ సభ అత్యంత విజయవంతం కాబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నగరంలో స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మనమందరం ఇప్పటి నుంచే ఎన్నికలకు సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న మూడు కార్పొరేషన్ ఎన్నికలతో పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఈ రోజు నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. రానున్న ట్రై-కార్పొరేషన్ ఎన్నికల్లో మూడింటికి మూడు స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో తిరగాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి బాధ్యతగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశర చేశారు. హైదరాబాద్ నగరం ప్రస్తుతం మజ్లిస్ పార్టీ కబంధ హస్తాల్లో చిక్కుకుందని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఏ అధికారులు ఉండాలో, ఎవరు ఎక్కడ పని చేయాలో సెక్రటేరియట్ నుండి కాకుండా దారుసలాం నుండి వచ్చే ఆదేశాలే నిర్ణయిస్తున్నా యని మండిపడ్డారు. ఈ దారుణమైన పరిస్థితి మారాలంటే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు గతంలో బీఆర్ఎస్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారని, కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా ప్రజలను మోసం చేసి మజ్లిస్ పార్టీకే కొమ్ముకాశాయని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీకి 50 శాతం స్థానాలు అందించి మోదీ ప్రభుత్వానికి అండగా నిలిచారని, అదే నమ్మకంతో రాష్ట్రంలోనూ మార్పు కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో,రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'సర్' పక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మజ్లిస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. సర్ వస్తుందంటే మజ్లిస్ పార్టీ ఎందుకు అంతగా భయపడుతోంది? పాతబస్తీలో అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, ఇతర అక్రమ వలసదారుల ఓట్లు ఎక్కడ తొలగిపోతాయోనని వారికి వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల మీద నమ్మకం లేకపోవడం శోచనీయమన్నారు. ఈ పక్రియలో పనిచేసేది కేంద్ర అధికారులు కాదు, తెలంగాణ ఉద్యోగులేనని గుర్తుచేశారు. గత 2002 లో ఇలాంటి సర్వే జరిగినప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ భాగస్వామ్యమే ఉందని, నాడు లేని భయం ఈ రోజు ఎందుకు అని నిలదీశారు. పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు అక్రమ వలసదారులు మనవాళ్లపై అరాచకాలు చేశారని, కానీ అక్కడ బీజేపీ పట్టు సాధించాక వారంతా తోకముడిచి బంగ్లాదేశ్ పారిపోతున్నారని వివరించారు. నగర రక్షణ కోసం 'సర్' లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, దీనిని అడ్డుకోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఒకవేళ మీ ఓటు హైదరాబాద్‌లో ఉంటే గ్రామాల్లో రేషన్ కార్డులు, పింఛన్లు పోతాయంటూ కాంగ్రెస్ నాయకులు అమాయక ప్రజలను బెదిరిస్తున్నారు. ఓటు హక్కుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం ఉండదు. దీనివల్ల ఎవరి కార్డులు కట్ అవ్వవని ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యకర్తలంతా బీఎల్‌ఓలతో కలిసి తిరిగి ప్రజల ఓటు హక్కును కాపాడాలని సూచించారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లు

ఈ కార్యక్రమంలో పదో తరగతి 55 మందికి రూ.30 వేల నగదు బహుమతి, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 61 మంది విద్యార్థులకు స్టార్స్‌కు ల్యాప్‌టాప్‌లు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యా విధానం గురించి చర్చ జరిగేలా సంస్కరణలు చేపట్టామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల నుంచి రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖలో పలు సంస్కరణలు చేపట్టామని, వాటి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగిందని తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం ఎవరూ ముందుకు రాకపోయినా, ఇప్పుడు సీట్ల కోసం సిఫార్సులు వచ్చే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో రాజకీయాలకు చోటు ఉండకూడదని నిర్ణయించామని, పాఠశాలల్లో రాజకీయ ప్రచారానికి అవకాశం ఇవ్వబోమని చెప్పారు. వ్యక్తిగత రాజకీయ ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, 2019లో మంగళగిరి నియోజకవర్గంలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానని, తొలి రోజు బాధ కలిగినా ఆ తర్వాత అదే తనలో మరింత కసిని పెంచిందని చెప్పారు. విద్యా రంగంలో మార్పు తీసుకురావడానికి రెండేళ్లు కష్టపడ్డానని, ఇప్పుడు ఆ ఫలితాలు కనిపిస్తున్నాయని లోకేష్ పేర్కొన్నారు.

# జీవితం అంటే వందమీటర్ల పరుగుపందెం కాదు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** జీవితం వంద మీటర్ల పరుగుపందెం కాదని.. మన ఓపికకు పరీక్ష అని భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. రాజకీయాల్లో ఎలాంటి సవాళ్లు ఎదుర్కొన్నారని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. చిన్న వయసులోనే అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. రాజకీయాల్లోకి వచ్చాక నా భవిష్యత్తుపై గందరగోళంలో పడ్డాను. ఏ పని చేసినా నాదైన ముద్ర ఉండాలని గట్టిగా అనుకున్నాను. అప్పగించిన పనిని నిబద్ధతతో పూర్తి చేయడమే నా బలం. వేగంగా లక్ష్యాలు చేరాలనే ఆరాటంలో నేటి యువత ఉంది. ఏ పనినైనా ఓపిక, నిలకడ, శక్తితో చేసినప్పుడే ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదిలావుంటే రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. ఇదే సందర్భంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు వర్చువల్ విధానం ద్వారా మరో 9 జిల్లాల పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, అలాగే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన



అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడే తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఆయన ఈ సందర్భంగా స్మరించుకున్నారు. గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు.. అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణకు లీడర్లు ఎంతో దూరం లేరని, రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా సంఘర్షణ చేసి ఎలాగైతే విజయం సాధించామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు. బెంగాల్‌లో పార్టీని గెలిపించిన సునీల్ బన్సల్ ఇక్కడే ఉన్నారని, తెలంగాణలో కూడా అంతకన్నా ఎక్కువ కష్టపడి పార్టీని గెలిపించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షిస్తున్న 'వికసిత భారత్' లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే 'డబుల్ ఇంజన్ సర్కార్' వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల అసలైన కలలు సాకారం కావాలన్నా, ఒక వికసిత తెలంగాణ నిర్మాణం జరగాలన్నా ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. కాగా, సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్‌ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు , ముఖ్య కార్యకర్తలతో సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశర చేశారు.

## దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతి

రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. భవిష్యత్ నగరంగా నిర్మిస్తు?న్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని.. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

## హరీష్ రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలన్న హరీష్ రావు వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. తెలంగాణ ప్రజానీకం మాకు ఐదేళ్లకు అధికారమిచ్చారు. రెండున్నరేళ్లకే ఎందుకు అసెంబ్లీని రద్దు చేస్తాం. ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. గడచిన రెండున్నర సంవత్సరాలలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల తీర్పు ఏవిధంగా ఉందో హరీష్‌రావుకు తెలుసు. ఇప్పుడు కొత్తగా వచ్చే తీర్పు ఏముంది? రెండుకాళ్లు లేనివాడు చూసుకుందాం రా.. అని సవాలు విసిరినట్లే బిఆర్ఎస్ నాయకుల సవాళ్లు ఉంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం చేసే మంచిపనులను జీర్ణించుకోలేక భవిష్యత్తులో అధికారం దక్కదనే ఆవేశం, ఆక్రోశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారు. నా నియోజకవర్గం పాలేరులో కేటీఆర్ విమర్శలు ఇదే కోవలోకి వస్తాయి. బిఆర్ఎస్ నాయకులు చేసే చిల్లర విమర్శలకు ప్రతిసారీ స్పందించను. ఎప్పుడో ఒకసారి కచ్చితంగా కర్ర కాల్చి వాత పెడతా. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తేనే బాంబులు పేలినట్టుకాదు. ప్రజలు ఛీ కొట్టినా బాంబులు పడ్డట్టే. ఏ వ్యక్తిమీదా వ్యక్తిగత కక్షపూరితమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. తప్పుచేసిన వాళ్ళను జైలులో వేస్తేనే శిక్షించినట్లు కాదు. ప్రతి ఎన్నికల్లో వాళ్లను ఓడించి ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారు. తమిళనాడు లాంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో తీసుకురాం. అధికారంలోకి వస్తామని బిజేపీ పగటికలలు కంటోంది. ఆశ ఉండడంలో తప్పులేదు కానీ ఆ పార్టీ అత్యాశకు పోతోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ రాని పార్టీ అధికారం గురించి ఆశ పడుతోంది. బిజేపీ, బిఆర్ఎస్ ఒకే తాను ముక్కలు. కాళేశ్వరం అవినీతి, థర్మల్ పవర్ ఎ÷-లాంట్ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని అడిగితే బిజేపీ ఇప్పటివరకు స్పందించలేదు. ఈ సారి రైతు భరోసా నిధులను అనుకున్నదానికంటే రెండు మూడు రోజుల ముందే వారం రోజుల్లోనే రైతుల ఖాతాలో జమచేస్తాం. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటివరకు 18 నియోజకవర్గాలలో 23 స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు. భూముల ధరల సవరణలు ఎక్కడైనా పొరపాటుగా ఎక్కువ ధర నిర్ణయిస్తే సరిచేయడానికి సిద్దంగా ఉన్నాం. తాండూరులో ఇదే విధంగా జరిగితే సరిదిద్దడం జరిగింది. అని మంత్రి పొంగులేటి అన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్: కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు, గతంలో పాసు బుక్కు వచ్చి రైతు భరోసాకు దరఖాస్తులు చేసుకోని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోనాపూర్ క్లస్టర్ ఏఈవో జ్ఞానేశ్వర్ రైతులకు సూచించారు. కోనాపూర్ రైతు వేధికలో రైతు భరోసా దరఖాస్తులను ఆయన సోమవారం రైతుల నుంచి స్వీకరించారు. రైతు భరోసా పథకానికి జులై 5లోపు ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ ఫారం, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, బ్యాంకు ఖాతా జీరాక్స్ లను రైతువేదికలో అందించాలని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# కేంద్రం సహకరిస్తేనే రాష్ట్రాలు అభివృద్ధి సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పలు కీలక సమస్యలు, నిధుల విడుదల అంశాలపై వినతిపత్రం సమర్పించారు. 'వికసిత్ గ్రామాలు-2047' అనే గొప్ప ఆశయం నెరవేరాలన్నా, గ్రామీణ ప్రాంతాలు స్వయంసమృద్ధి సాధించాలన్నా రాష్ట్రాలపై కేంద్రం అదనపు ఆర్థిక భారం మోపకూడదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన విబిజి రామ్



పథకంలో ప్రవేశపెడుతున్న కొత్త 60:40 నిధుల విధానంపై తెలంగాణ ప్రభుత్వం తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ నూతన ఆర్థిక సమీకరణ వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ నిబంధనలపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఒక తుది నిర్ణయం తీసుకోనుందని వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గతంలో ఉన్నట్లుగానే 100 శాతం వేతనాల విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. అలాగే మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి కూడా గతంలో ఉన్న 75 శాతం కేంద్ర వాటాను అలాగే ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులు కోల్పోకుండానే, రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిస్థాయిలో కాపాడేలా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తుందని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రాష్ట్రంలో చేపట్టే గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన అడ్డంకిగా మారాయని మంత్రి సీతక్క కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్లమల అటవీ ప్రాంతాల్లో అనేక రోడ్డు పనులు పూర్తిగా నిలిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రోడ్లే కాకుండా, అటవీ అనుమతులు సకాలంలో రాకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని పేదలకు ఇళ్లు, బోర్‌వెల్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు కూడా అర్థాంతరంగా ఆగిపోయాయని వివరించారు. ఈ క్లియరెన్స్ పక్రియను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రావాల్సిన పీఎం ఆవాస్ యోజన గృహాల కేటాయింపులను కేంద్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్రం నుండి నిధుల విడుదలలో జరుగుతున్న జాప్యం వల్ల పనులు మందగిస్తున్నాయని, రాష్ట్రంలో అధికారుల తరచూ బదిలీల వల్ల కూడా కేంద్రానికి నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగిందని ఆమె అంగీకరించారు. ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోందని మంత్రి సీతక్క గర్వంగా ప్రకటించారు.

# తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక సహకారం

(మొదటి పేజీ తరువాయి)

ల్గ÷దరాబాద్, జూన్ 29: ఈ ఏడాది అక్టోబర్ 25న హైదరాబాద్‌లో తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం నిర్వహించాలని తెలంగాణ - కొరియన్ కల్చరల్ సెంటర్ లు సంయుక్తంగా సూత్రప్రాయ అంగీకారానికి వచ్చాయి. తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు పక్షాలు చర్చించాయి. భారత్‌లోని కొరియన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్, భారతదేశంలోని కొరియా రాయబార కార్యాలయం కల్చర్ అండ్ ప్రెస్ కౌన్సిలర్ హ్వాంగ్ ఇల్యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ గొప్ప చారిత్రక వారసత్వం, వైవిధ్యభరితమైన సంస్కృతి, సంప్రదాయ కళారూపాలు, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ప్రతిపాదిత తెలంగాణ-కొరియా సాంస్కృతిక మహోత్సవం ద్వారా ఇరు ప్రాంతాల కళలు, సంగీతం, నృత్యం, వంటకాలు, సంప్రదాయాలను ఒకే వేదికపై ఆవిష్కరించే అవకాశం లభిస్తుందని, పర్యాటకాభివృద్ధితో పాటు ప్రజల మధ్య సత్సంబంధాలు మరింత పెరుగుతాయని తెలిపారు. భారత్‌లో, ముఖ్యంగా యువతలో కొరియన్ కే-డ్రామాలు, కొరియన్ వినోద కార్యక్రమాలకు ఓటీటీ వేదికల ద్వారా విశేష ఆదరణ లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సాంస్కృతిక అనుబంధం తెలంగాణ-కొరియా మధ్య పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించడంతో పాటు కళలు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, సృజనాత్మక భాగస్వామ్యాలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అన్నారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, సృజనాత్మక పరిశ్రమల రంగాల్లో కొరియాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, వారసత్వ పరిరక్షణ, పర్యాటక ప్రోత్సాహం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

# ఖమ్మంలో భారీ వర్షాలతో సీఎం ఆశీర్వాద సభ రద్దు

### నేడు శిల్పకలా వేదికగా రైతభరోసా నిర్వహణ

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ రద్దయ్యింది. వర్షాల కారణంగా సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో మధిరలో జరగాల్సిన సీఎం రేవంత్ రెడ్డి సభలో మార్పులు చేశారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ శిల్పకళా వేదికకు మార్చారు. సాయంత్రిం ఈ వేదికలో రైతుభరోసా పంపిణీ సదస్సు నిర్వహించనున్నారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి.. రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు, అధికారులను సీఎం ఆదేశించారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో మంగళవారం రైతు ఆశీర్వాద సభ జరగాల్సి ఉంది. ఈ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై.. రైతుభరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు లక్ష మందితో సభ నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని... అందుకు తగ్గట్టుగా జగన్నాథపురంలో ఏర్పాట్లు చేశారు. అయితే, రెండు రోజులుగా కురుస్తున్న భారీగా వర్షాలకు సభా ప్రాంగణంలో పెద్దఎత్తున వరద నీరు చేరుకుంది. దీంతో సభ నిర్వహించేందుకు అవకాశం లేదని మంత్రులు, సీఎంవో కార్యాలయానికి జిల్లా అధికారులు తెలియజేశారు. దీంతో ప్రభుత్వం మధిరలో సభను రద్దు చేసి.. సభా వేదికను హైదరాబాద్‌కు మార్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

# కొడంగల్‌లో 33వేల డూప్లికేట్ ఓట్లు

### రేవంత్ గెలిచింది ఆ ఓట్లతోనే .. టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు



రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో కేవలం 800 ఓట్లు మాత్రమే తొలగించారని కవిత అన్నారు. కొండగల్‌లో తాము వెరిఫై చేస్తే 33వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో డూప్లికేట్ ఓట్లు చాలా ఉన్నాయని తెలిపారు. మొన్నటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి 32వేల మెజారిటీతో గెలిచారని అన్నారు. ఈ డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని తమకు అనుమానం ఉందని చెప్పారు. కర్ణాటక నుంచి నోటు ట్రాన్స్‌ఫర్‌తో పాటు ఓటు ట్రాన్స్‌ఫర్ అయిందా అనే అనుమానం తమకు కలుగుతోందని కవిత పేర్కొన్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 'సర్' దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రాల మధ్య ఉన్న డేటాను వెంటనే పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న ఓటర్లకు ఏపీలో కూడా ఓటు ఉందని... ఎక్కడైనా ఒక చోటు మాత్రమే ఓటు ఉండేలా చూడాలని సూచించారు. ఇంటర్ స్టేట్ డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. ఎన్నికల సంఘానికి ఈ విషయాలపై ఫిర్యాదు చేస్తామని కవిత పేర్కొన్నారు.

# తెలంగాణలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త




బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది.రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝాకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సున్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ, డీఐజీ జోన్-4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు.ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌కు జోన్-2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చి. సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# మూడేళ్ల బాలికపై అత్యాచారం

### నిందితుడికి మరణశిక్ష విధింపు

ముంబై,జూన్29(ఆర్ఎన్ఎ): మూడేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడ్డ 65 ఏళ్ల వ్యక్తికి పుణెలోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ కేసు అత్యంత అరుదైనదని అడిషనల్ జడ్జి ఎస్ఆర్ సాలంఖే అభిప్రాయపడ్డారు. అత్యంత పాశవిక చర్యకు పాల్పడ్డ నిందితుడు భిమ్‌రావ్ కాంబ్లేకు మరణ శిక్ష విధించక తప్పదని అన్నారు. గతంలోనూ పలు నేరాలు చేసిన చరిత్ర భీమ్‌రావ్‌ది అని పేర్కొన్నారు. ఈ కేసులో కోర్టు భీమ్‌రావ్‌ను జూన్ 25న దోషిగా తేల్చింది. తాజాగా శిక్ష ఖరారు చేసింది. మే 1న జిల్లాలోని భోర్ తెహసిల్‌లోని నస్రాపూర్ గ్రామంలో నిందితుడు దారుణానికి ఒడిగట్టాడు. చిన్నారికి మాయమాటలు చెప్పి పసువుల షెడ్డులోకి తీసుకెళ్లి దారుణానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతదేహాన్ని షెడ్డులో గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన అనంతరం పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకున్నారు. గతంలోనూ నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

# అయోధ్య విరాళాల దుర్వినియోగం

### 8మంది నిందులకు 14రోజుల రిమాండ్

లక్నో,(క్రైమ్ మిర్రర్): అయోధ్య రామాల య విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో వారు జులై 13 వరకు జైలులోనే



ఉండనున్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించడంతో.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది న్యాయస్థానం. ఈ కేసులో రామశంకర్ అలియాస్ తిన్నూ యాదవ్ సహా అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణెశిశ్ పాండే, రామ్‌శంకర్ మిశ్రా, సుభాశ్ శ్రీవాస్తవ్‌లు నిందితులుగా ఉన్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికే నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(ఎస్ఐటీ).. సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. నిందితులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు అకౌంట్లు, ఆస్తుల వివరాలను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఈ కేసులో కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే అనుమానంతో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టినట్టు తెలుస్తోంది. దీంతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# 4న ఖమేనీ అంత్యక్రియలు

### హాజరు కానున్న కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్): ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరపున విదేశాంగ శాఖ సహాయమంత్రి పబిత్ర మార్గరీటా హాజరుకానున్నట్టు సమాచారం. మంత్రి పబిత్రతో పాటు బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కూడా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు రావాలని ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవల ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో భారత్ తరపున కేంద్ర మంత్రి, బిహార్ గవర్నర్ ఇరాన్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. అయతొల్లా జన్మస్థలమైన మష్హాద్ నగరంలోనే జులై 4న ఆయన అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు జరిగిన దాడిలోనే ఖమేనీ కన్నుమూశారు. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌ను ముందుండి నడిపించారు. ఖమేనీ స్మృత్యర్థం కోమ్ నగరంలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖమేనీ అంత్యక్రియలపై తొలి నుంచీ కొంత సందిగ్ధత నెలకొంది. జూన్‌లో అంత్యక్రియలు పూర్తవుతాయని మొదట్లో వార్తలు వెలువడ్డాయి. అయితే, జులైలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వ మీడియా ఇటీవల ధ్రువీకరించింది. అంత్యక్రియలకు దాదాపు 20 మిలియన్ల మంది హాజరుకానున్నట్టు ఇరాన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ కూడా ఇరాన్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక అయతొల్లా ఖమేనీ అనంతరం ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతం ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఉన్నారు. అయితే, ఆయన ఎక్కడున్నారనే దానిపై స్పష్టత లేదు. మొజ్తాబా ఆరోగ్యంపై కూడా పలు వార్తలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉండే అవకాశం ఉందని సీనియర్ యూఎస్ అధికారులు పలుమార్లు తెలిపారు.



క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

4

మంగళవారం

30-6-2026

ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పుడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది.

శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లవ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10

## మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమాసియా!


ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి

ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి. వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

ఒక దేశం యొక్క నిజమైన శ్రేయస్సు దాని పౌరుల ఆరోగ్యంలో ప్రతిఫలిస్తుంది. ఆర్థిక వృద్ధి సూచికలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి ఇవన్నీ దేశ ప్రగతికి ముఖ్యమైన కొలమానాలే కావచ్చు. కానీ ఆ ప్రగతి ఫలాలను అనుభవించే సామాన్య మనిషి శరీరం ఆరోగ్యంగా లేకుంటే, ఆ అభివృద్ధికి అసలు అర్థమేముంది? అందుకే ప్రజారోగ్యం అనేది కేవలం వైద్య విభాగానికి సంబంధించిన ఒక సాధారణ సాంకేతిక అంశం కాదు. అది ఒక సామాజిక న్యాయం, ఒక రాజ్యాంగ హక్కు, మరియు ఏ ప్రభుత్వానికైనా తప్పనిసరిగా నెరవేర్చవలసిన ప్రాథమిక నైతిక బాధ్యత.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి పౌరునికి గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కును కల్పిస్తోంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం సైతం పలు చారిత్రాత్మక సందర్భాలలో ఈ జీవించే హక్కులో ఆరోగ్య హక్కు కూడా అంతర్భాగమని స్పష్టం చేసింది.

అమలు చేస్తే మారుమూల ప్రాంతాల వారికి సైతం నగరాల్లోని నిపుణుల వైద్య సేవలు అందుతాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల అమలవుతున్న కొన్ని డిజిటల్ ఆరోగ్య పథకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, వాటిని మరింత విస్తృతంగా, పారదర్శకంగా మార్చాల్సి ఉంది.గతంలో వచ్చిన కోవిడ్-19 మహమ్మారి మన దేశ ఆరోగ్య వ్యవస్థ యొక్క వాస్తవ బలహీనతలను నిస్సందేహంగా బట్టబయలు చేసింది. ఆక్సిజన్ కొరత, ×జఖ బెడ్ల కొరత, ఉచిత టీకాల సరఫరాలో ఎదురైన అసమానతలు ఇవన్నీ దేశవ్యాప్తంగా ఒక చీకటి అధ్యాయాన్ని మిగిల్చాయి. ఆ సంక్షోభ సమయంలో ఏ ప్రభుత్వం వేగంగా స్పందించిందో, ఏ రాష్ట్రం వైద్య రంగాన్ని బాగా నిర్వహించిందో ప్రజలందరికీ అర్థమైంది. ఆ మహమ్మారి

# ప్రజారోగ్యం - ప్రభుత్వ బాధ్యత




అయితే క్షేత్రస్థాయిలో ఈ హక్కుల నిజమైన అమలు జరుగుతోందా అని మనం ఆత్మపరిశీలన చేసుకుంటే జవాబు ఇంకా నిరాశాజనకంగానే మిగులుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో సహా దేశవ్యాప్తంగా వేలాది మంది గ్రామీణ పౌరులు నేటికీ సరైన ప్రాథమిక వైద్య సేవలకు ఆమడదూరంలో జీవిస్తున్నారు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చాలా చోట్ల కేవలం నామమాత్రంగానే దర్శనమిస్తున్నాయి. అక్కడ సరైన వైద్యులు ఉండరు, అవసరమైన మందులు దొరకవు, కనీస నిర్వహణ కూడా లోపిస్తుంది. ఒక సాధారణ రోగి కనీస చికిత్స కోసం 30 నుండి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జిల్లా ఆసుపత్రికి చేరుకుంటే, అక్కడ కూడా మంచాలు నిండిపోయి దీనస్థితి కనిపిస్తుంది. ఈ దుస్థితి కేవలం ఒక వ్యక్తిగత దురదృష్టం కాదు ఇది మన వ్యవస్థాగత వైఫల్యానికి నిదర్శనం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించిన అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం, ప్రతి 1,000 మంది జనాభాకు కనీసం ఒక వైద్యుడు అందుబాటులో ఉండాలి. కానీ భారత్‌లో పలు రాష్ట్రాల్లో ఈ నిష్పత్తి అత్యంత దారుణంగా ఉంది. ముఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో అయితే పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.ప్రస్తుతం భారత్ తన మొత్తం జిడిపి లో ఆరోగ్య రంగంపై చేసే వ్యయం కేవలం 1.5 నుండి 2 శాతం మాత్రమే. అదే సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు తమ బడ్జెట్‌లో 6 నుండి 10 శాతం వరకు ప్రజల ఆరోగ్యం కోసం ఖర్చు చేస్తున్నాయి. ఈ భారీ తేడా మనకు స్పష్టంగా కనిపిస్తుంది మన ప్రభుత్వ ఆసుపత్రుల అధ్వాన్న పరిస్థితుల్లో, మందుల కొరతలో, నిపుణులైన సిబ్బంది లేమిలో.ఇటీవలి గణాంకాల ప్రకారం, భారత్‌లో 60 శాతానికి పైగా ఆరోగ్య వ్యయం " అవుట్ -అఫ్ - పాకెట్ ఎక్సపెండిచేర్ " గా ఉంటోంది అంటే సామాన్య ప్రజలు అనారోగ్యం వస్తే తమ స్వంత జేబు నుండే డబ్బులు చెల్లించుకుంటున్నారు. ఒక్క పెద్ద అనారోగ్యం వల్ల ఎన్నో మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పులపాలులై పేదరికంలోకి జారిపోతున్నాయి. ఇది సర్వసాధారణంగా మారిన నేటి సామాజిక వ్యవస్థ ఎంతమాత్రం అంగీకరించదగినది కాదు.ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి ప్రభుత్వం తక్షణమే కొన్ని కీలక రంగాలపై దృష్టి పెట్టాలి. ప్రతి పంచాయతీ స్థాయిలో పూర్తి స్థాయి వసతులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించాలి. వాటిలో శిక్షణ పొందిన వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. ఉచిత మందుల సరఫరా నిరంతరంగా సాగాలి. ఇవి కేవలం కాగితాల మీది హామీలుగా కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరగాలి.చికిత్సకన్నా నివారణ శ్రేయస్కరం అనే నానుడిని నిజం చేయాలి.

సకాలంలో టీకాకరణ కార్యక్రమాలు, గర్భిణీలకు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, స్వచ్ఛమైన త్రాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రత పాటింపు ఇవి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాల్సిన రంగాలు. అంటువ్యాధులు ప్రబలే ముందే వాటిని సమర్థంగా అడ్డుకోవడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత కావాలి. చాలా మంది ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ మహిళలు, తమ ఆరోగ్య హక్కుల గురించి అవగాహన లేక, భయంతో లేదా అజ్ఞానంతో ప్రాథమిక దశలో వైద్యం తీసుకోవడం వాయిదా వేస్తుంటారు. ప్రభుత్వం ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆరోగ్య మిత్రుల ద్వారా ప్రతి ఇంటికీ చేరి అవగాహన కల్పించాలి. ఆరోగ్య అక్షరాస్యతను పెంచడం నేటి అత్యవసర అవసరం. కార్పొరేట్ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల విపరీతమైన విజృంభణ వల్ల నేడు ఆరోగ్య సేవలు ఒక పెద్ద వ్యాపారం గా మారిపోయాయి. అడ్డగోలుగా వేసే బిల్లులు, అనవసరమైన పరీక్షలు, నాణ్యత లేని చికిత్సలు సామాన్యులను వేధిస్తున్నాయి. ప్రభుత్వం దీనిపై కఠినమైన నియంత్రణ విధించాలి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా నిర్ణీత శాతం బెడ్లను పేదలకు ఉచితంగా లేదా అతి తక్కువ ధరకు అందించేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలి. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో టెలిమెడిసిన్, ఆరోగ్య పోర్టళ్లు, డిజిటల్ రోగి రికార్డులు వీటిని సమర్థంగా

సంక్షోభం గడచిపోయి ఉండవచ్చు, కానీ అది సమాజానికి ఇచ్చిన సందేశం మాత్రం శాశ్వతం ఏ క్షణంలోనైనా విపత్తులను తట్టుకోవడానికి మన ప్రజారోగ్య వ్యవస్థ ఎల్లప్పుడూ బలంగా, సంసిద్ధంగా ఉండాలి.

ఆరోగ్య పరిరక్షణ విషయంలో బాధ్యతనంతటినీ ప్రభుత్వంపై మాత్రమే వదిలిపెట్టడం పౌరులుగా సరికాదు. ప్రజలు కూడా తమ ప్రాథమిక ఆరోగ్య హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలి. ప్రభుత్వ ఉచిత వైద్య పథకాలు, ఆరోగ్యశ్రీ వంటివి క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలవుతున్నాయా లేదా అని నిఘా పెట్టాలి. స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఆరోగ్య సమస్యలను నిలదీయాలి. మీడియా, పౌర సమాజం, విద్యావంతులు ఈ వ్యవస్థాగత లోపాలపై నిరంతరం గళమెత్తినప్పుడే మార్పు సాధ్యమవుతుంది.నా ఆరోగ్యం నా సంపద అనే మాట కేవలం ఒక వ్యక్తికి మాత్రమే వర్తించదు అది ఒక దేశానికీ వర్తిస్తుంది. ఆరోగ్యవంతమైన పౌరులు మాత్రమే దేశానికి ఉత్పాదకంగా పని చేయగలరు, నూతన ఆవిష్కరణలతో సమాజాభివృద్ధికి తోడ్పడగలరు, మరియు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనగలరు. అందుకే ప్రజారోగ్యం కాపాడటం అనేది ప్రభుత్వాలు చేసే దాతృత్వం కాదు అది వారి రాజ్యాంగ ధర్మం, పరిపాలనా కర్తవ్యం, మరియు అత్యంత మౌలికమైన బాధ్యత.ప్రతి బడ్జెట్‌లోనూ రక్షణ రంగానికి ఇచ్చే ప్రాధాన్యతతో పాటు ఆరోగ్య రంగానికి కేటాయింపులు గణనీయంగా పెరగాలి. ప్రతి ప్రజాప్రతినిధి తన నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రి స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించాలి. ప్రతి వైద్య అధికారి ప్రజా సేవకు జవాబుదారీగా ఉండాలి. ప్రతి పౌరుడు తన ఆరోగ్య హక్కు కోసం చైతన్యంతో గళమెత్తాలి. అప్పుడే ఆరోగ్యవంతమైన తెలుగు నేల, తద్వారా ఆరోగ్యవంతమైన భారతదేశం అనే కల కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిజ జీవితంలో సాకారమవ్వాల్సిన ఒక గొప్ప లక్ష్యంగా మారుతుంది.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# ముఖం చాటేసిన నైరుతి

## దేశవ్యాప్తంగా వర్షాల కోసం ఎదురుచూపు

## ఏరువాక సాగక రైతన్న ఆందోళన



న్యూఢిల్లీ,జూన్29 దేశంలో నైరుతి రుతుపవనాలు జూన్ 4న కేరళ తీరాన్ని తాకినప్పటికీ, దేశంలోని చాలాప్రాంతాలు ఇంకా వర్షాల కోసం వేచి చూస్తున్నాయి. గత 146 ఏండ్ల వాతావరణ చరిత్రలో ఈ జూన్ నెల అత్యంత పొడిగా నమోదైన నెలల్లో ఒకటిగా నిలిచిందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మొత్తంగా దేశంలో నైరుతి రుతుపవనాలు మళ్లీ ముఖం చాటేశాయి. జూన్ 4 నుంచి 28 మధ్య సాధారణంగా 141.4 ఎంఎం వర్షం కురువాల్సి ఉండగా, ఈసారి 77.1 ఎంఎం వర్షపాతమే నమోదైంది. కదిలే మేఘాలు ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాలు, దక్షిణ-మధ్య అరేబియా సముద్రానికే పరిమితమయ్యాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన వర్షపాతం పటం రుతుపవనాల అస్థిర ప్రభావాన్ని తెలియజేస్తున్నది. గుజరాత్ 86 శాతం వర్షపాతలోటుతో ఉండగా, మహారాష్ట్రలో 60 శాతం లోటు నమోదైంది. మధ్యప్రదేశ్ లో 42 శాతం, యూపీలో 59 శాతం, బీహార్‌లో 52 శాతం, ఒడిశాలో 53 శాతం, తెలంగాణలో 32 శాతం, కర్ణాటకలో 47 శాతం వర్షపాత లోటు రికార్డయ్యింది. తెలంగాణ రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ.. ఎల్ నినో ప్రభావం వల్ల చాలాప్రాంతాల్లో చినుకుజాడ కరువైంది. వానకాలం సాగుపై రైతుల్లో ఆందోళన పెరుగుతున్నది. జూన్ 15 నాటికి దేశంలోని దక్షిణ, తూర్పు, ఈశాన్య ప్రాంతాలకు విస్తరించిన రుతుపవనాలు, తర్వాత స్తంభించిపోయాయి. దేశంలోని చాలాప్రాంతాల్లో 40 శాతం తకువ వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెల లోటును భర్తీ చేయడానికి కొంతసమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాతావరణంలో తేమ శాతం పెరుగడం వల్ల, సుదీర్ఘ పొడికాలం తర్వాత అకస్మాత్తుగా కురిసే భారీవర్షాలు, వరదలు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 8.35 సెం.మీ, కరీంనగర్ జిల్లా రామడుగులో 6.94 సెం.మీ, కరీంనగర్ రూరల్‌లో 6.15 సెం.మీ, జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో 5.20 సెం.మీ, మెట్‌పల్లిలో 4.31 సెం.మీ, కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లో 5.20 సెం.మీ, సూర్యాపేట జిల్లా మద్దిరాళ్లలో 4.09 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదయినట్టు అధికారులు తెలిపారు.

# విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, సమస్యల పరిష్కారంమే బీఆర్ఎస్ ధ్యేయం

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



గండిపేట(క్రైం మిర్రర్): విద్యాభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, సమస్యల పరిష్కారంమే బీఆర్ఎస్ ధ్యేయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిఅన్నారు. ఏబీవీపీ నాయకులు సోమవారం కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి కార్తీక్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. శంషాబాద్ 119వ డివిజన్ అధ్యక్షులు కొనమొల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎబివిపి చెందిన పలువురు విద్యార్థి సంఘం నాయకులు బీఆర్ఎస్ పార్టీలో ఘనంగా చేరారు. మనీష్ ముదిరాజ్ (ఏబీవీపీ ఎస్ఎఫ్‌డి స్టేట్ కో-ఆర్డినేటర్), అమీర్ పేట చరణ్ దీప్ - స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, శివ-విభాగ్ ఫారమెడికల్ కన్వీనర్,శ్యామ్-టౌన్ జాయింట్ సెక్రటరీ, జై కుమార్-టౌన్ వైస్ ప్రెసిడెంట్, సందీప్-టౌన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, విద్యార్థి నాయకులు, సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం , విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, అవకాశాలు కల్పిస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతోనే తాము పార్టీలో చేరినట్లు తెలిపారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి, రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 118 , 119 డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసింహ, పార్టీ ప్రధాన కార్యదర్శి చిలక మల్రి పరందాములు , బైరమోని మల్లేష్, చరణ్, కృష్ణ రెడ్డి, రాచమల్ల రమేష్, మురళి గౌడ్, మంచర్ల హరికృష్ణ, మాడపాటి నరేందర్, యూత్ అధ్యక్షులు జివి.పవిత్ర సాగర్, శివ గౌడ్ , దీపక్ గౌడ్ , బీఆర్ఎస్ పార్టీ, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తండ్రి హత్య కేసులో కుమారుడికి యావజ్జీవ కారాగార శిక్ష



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 29: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన తండ్రి హత్య కేసులో నిందితుడికి సంగారెడ్డి నాల్గవ అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. నిందితుడు పద్మటి అశోక్ రెడ్డి తన తండ్రి పద్మటి మాధవరెడ్డిని భూమి విక్రయ వివాదం నేపథ్యంలో హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో బలమైన శాస్త్రీయ సాక్ష్యాధారాలను సమర్పించిన పోలీసులు, సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయవాది కృషితో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.2,200 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రభుత్వ న్యాయవాదిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ అభినందించారు.

## బండ్లగూడ జాగీర్‌లో ఘనంగా ‘ఎస్ఐఆర్’ కార్యక్రమం: అంకం శ్రీనివాస్ నేత



గండిపేట(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ జాగీర్ హిమగిరి నగర్ రోడ్ నెంబర్ 3లో గల అమర్ కిరానా జనరల్ స్టోర్ వద్ద ‘ఎస్ఐఆర్’ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆల్ పార్టీ జేఏసీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు అంకం శ్రీనివాస్ నేత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, వివిధ పార్టీల ప్రతినిధులు, జేఏసీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, ఏ బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్ కుమార్, బోగల శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.....

## అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

### కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే






గండిపేట(క్రైం మిర్రర్): తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం గండిపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మొత్తం 29 మందికి రూ.29లక్షల3364 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భారం కాకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పేదింటి యువతుల వివాహానికి కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలు ఎంతో లబ్ధిచేకూరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గండిపేట్ మండల తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గణేష్‌నగర్‌లో ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మార్వో బొమ్మ రాములు



గండిపేట(క్రైం మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియను ఎమ్మార్వో బొమ్మ రాములు పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్‌వోలు, బిఎల్ఏలతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ప్రతి అర్హుడైన ఓటరికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని బిఎల్‌వోలకు సూచించారు. అలాగే ప్రజలు తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన పత్రాలతో పారాలను సకాలంలో సమర్పించాలని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఒక కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను ఎన్యూమరేషన్ ఫారంతో పాటు సంబంధిత అధికారులకు సమర్పించాలని ఎమ్మార్వో రాములు సూచించారు. ఓటరు సవరణ ప్రక్రియ 2002లో జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడే జరుగుతుందన్నారు. అర్హత ఉన్న ఒక ఓటు కూడా మిస్ కావద్దని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఉండేది ఇప్పుడు అర్హత ఉన్న ఒక ఓటు కూడా తొలగిపోవద్దు అని ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి బిఎల్‌వోలు వచ్చి ఒక్కొక్కరికి ఒక ఎన్యూమరేషన్ ఫారం ఇస్తారు మీరు రెండు ఫోటోలు రెడీ పెట్టుకోని 2002, 2025 ఓటరు జాబితా పరిశీలించి ఓటరు సవరణ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. జూలై 31వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, బాస శ్రీనివాస్‌నేత, పులిజాల వివేకానంద నేత, కళ్లెం లక్ష్మారెడ్డ, నోముల శేఖర్ నేత, అనంతయ్య, సంజీవ్, శ్యాంసుందర్, అనిల్, బిఎల్‌వోలు వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం


తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595


## ఎన్నో ఏండ్ల నిరీక్షణ నెరవేర్చిన కాంగ్రెస్

### భైరంపల్లిలో రూ.12 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..

### గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ లక్ష్యం కోగురి పురుషోత్తం రెడ్డి..



క్రైమ్ మిర్రర్ :కొందుర్గు:- కొందుర్గు మండలం భైరంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.12 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ, నిరంతర సహకారంతోనే గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు వేగంగా మంజూరవుతున్నాయని తెలిపారు.గ్రామాల అభివృద్దే మా లక్ష్యం అని నియోజక వర్గంలోని ప్రతి గ్రామంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారిస్తూ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. భైరంపల్లిలో నిర్మించనున్న ఈ సీసీ రోడ్డు వల్ల గ్రామ ప్రజలకు, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే బురద రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎన్నో ఏండ్ల నిరీక్షణ నెరవేరింది అన్నారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిశేటి శ్రీకాంత్-యాదమ్మ, మాజీ ఎంపీటీసీ తనయుడు అంజిరెడ్డి, నాగులపల్లి కుమార్, శంకరయ్య, యాదగిరి, యాదయ్య, వార్డు సభ్యులు జంగీర్, కృష్ణారెడ్డి, పాపయ్య, రామరాజు, పొట్ట శివకుమార్, కమ్మరి రాజు, రమేష్, చెన్నమయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు..

## మార్కండేయ నగర్‌లో ముమ్మరంగా డ్రైనేజీ పూడికతీత పనులు



గండిపేట(క్రైం మిర్రర్): కటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మైలార్ దేవ్ పల్లి సెక్షన్ పరిధిలో డ్రైనేజీ పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మార్కండేయ నగర్‌లో మొదట జెట్టింగ్ మిషన్ ద్వారా డ్రైనేజీలోని పూడికను, మట్టిని పైకి తీశారు. అనంతరం రోడ్డుపై నిలిచిన ఆ మట్టిని ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సిల్ట్ వెహికల్ ద్వారా అక్కడికక్కడే వేగంగా తొలగిస్తున్నారు. వాటర్ వర్క్స్ మేనేజర్ ఖాదర్ పర్యవేక్షణలో ఈ పూడికతీత పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్, ఎర్రోళ్ల ప్రశాంత్ ఇద్దరు లేబర్, డ్రైవర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఉంటూ పనులను స్వయంగా పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీల్లో డ్రైనేజీ లైన్లు పొంగిపొర్లకుండా ముందస్తుగా ఈ పనులు చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అసెంట్ 1.0 ఆధ్వర్యంలో ఘనంగా స్టార్టప్, నెట్‌వర్కింగ్ ఈవెంట్

**కూకట్ పల్లి, జూన్ 29 (క్రైమ్ మిర్రర్) :** యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో అసెంట్ 1.0 సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన స్టార్టప్ , నెట్‌వర్కింగ్ ఈవెంట్ ఘన విజయాన్ని సాధించింది. ఈ కార్యక్రమానికి సుమారు 300 మంది విద్యార్థులు నమోదు చేసుకుని తమ వినూత్న స్టార్టప్ ఆలోచనలను ప్రదర్శించారు. అలాగే 20 మందికి పైగా ఇన్వెస్టర్లు హాజరై విద్యార్థుల స్టార్టప్‌లను పరిశీలించి, వారితో నెట్‌వర్కింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ టాలీవుడ్ సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ హాజరై పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు బెస్ట్ స్టార్ట్ అప్ అవార్డ్స్ ను ప్రశంసాపత్రం తో పటు 20,000/- ప్రైజ్ మనీ ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సృజనాత్మక ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చి, ఉద్యోగాలను సృష్టించే వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రత్యేక అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఐటి ఫోరమ్ అధ్యక్షుడు కట్ట రవికుమార్ మాట్లాడుతూ స్టార్టప్ కార్యక్రమాలను ప్రోత్సహించే దిశలో తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసి భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు కలిసి పనిచేయాల్సిన




అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అసెంట్ వ్యవస్థాపకురాలు హంసిక దేవి మాట్లాడుతూ, "ఇది మా తొలి కార్యక్రమమే అయినప్పటికీ, హైదరాబాద్‌లో నిర్వహించిన అతిపెద్ద స్టార్టప్, నెట్‌వర్కింగ్ ఈవెంట్ ల లో ఒకటిగా నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విజయానికి కారణం అసెంట్ బృందంలోని ప్రతి ఒక్కరు తమ సమయాన్ని, శ్రమను అంకితభావంతో వెచ్చించి చేసిన కృషే. సహకారం లేకుండా ఈ స్థాయి విజయాన్ని సాధించడం సాధ్యమయ్యేది కాదు" అని అన్నారు. విద్యార్థులు, మెంటర్లు, పరిశ్రమల నిపుణులు, ఇన్వెస్టర్లు ఒకే వేదికపై కలుసుకుని ఆలోచనలు పంచుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తామని ఆమె వెల్లడించారు.



## అల్కాపూర్ తుల్జారామ్ బాగ్ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

**గండిపేట(క్రైం మిర్రర్):** అల్కాపూర్ తుల్జారామ్ బాగ్ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. వీఆర్4సహాయోగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పూజా సామాగ్రీ సమకూరుస్తూ పౌర్ణమి సోమవారం రోజున సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వత్రాలను ఆలయ పూజారి మండువల మధుసూధన్‌శర్మచే వినూత్న రీతిలో నిర్వహించారు. గణపతి పూజ, అమ్మవారికి కుంకుమార్చన, ప్రీతి పాత్రమైన ధాన్యాలతో నవగ్రహ, ఆస్టదిక్పాల పూజలు, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం విఘ్నేశ్ మహారాజ మార్గదర్శనంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. బడీనధని మేనేజర్ ట్రస్టీ అందే లక్ష్మణ్‌రావు, ట్రస్ట్ సభ్యులు సుమేనళిని, హరీ హరనాథ్‌రెడ్డి, నూకల మంజూ, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ నాంపల్లి ప్రాంగణాన్ని కాపాడుకుందాం.

### ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయొద్దని విద్యార్థుల ఉద్యమం



**కూకట్ పల్లి, జూన్ 29 (క్రైమ్ మిర్రర్):** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ నాంపల్లి క్యాంపస్ ను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయవద్దంటూ పీహెచ్‌డీ స్కాలర్లు, వివిధ విభాగాల విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల భవిష్యత్ ను కాపాడాలని, తెలుగు వర్సిటీని పరిరక్షించాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. సేవ్ తెలుగు యూనివర్సిటీ అంటూ కొద్ది రోజులుగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ స్కాలర్ జనార్ధన్ మాట్లాడుతూ స్థలాభావంతో విద్యార్థులు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో అభివృద్ధి చేయాల్సింది పోయి ప్రైవేటు వ్యక్తులకు కేటాయించాలని నిర్ణయించడం ఆందోళనకరమని అన్నారు. ప్రాచీన వస్తువులను భద్రపరచాలి అంటే, పక్కనే ఉన్న స్టేట్ మ్యూజియంలో ఉంచొచ్చని, అంతేకానీ ఓ మాజీ ప్రొఫెసర్ కు చెందిన చెందిన వస్తు ప్రదర్శనకు వర్సిటీని కట్టబెట్టడం సరికాదని అన్నారు. రూపాయి, అర్థరూపాయికి లీజుకు ఇచ్చేందుకు ఇది అపురూపమైన తెలుగు యూనివర్సిటీ అని గుర్తించుకోవాలని సూచించారు. ఉన్నత విద్యావంతులు, చదువు విలువ తెలిసిన జయధీర్ తిరుమలరావు లాంటి వ్యక్తులు తెలుగు వర్సిటీని తమ చేతుల్లోకి తీసుకోవాలనుకోవడం సరికాదని సూచించారు. తక్షణమే అటువంటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే వర్సిటీలో అక్రమంగా ఉంచిన వారి వస్తువులను బయటకు విసిరేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ డీ స్కాలర్లు, గోపాల్, రాంబాబు, సురేష్, హ్యూమన్ రైట్స్ స్టేట్ కమిటీ మెంబర్ మోహన్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్, జ్యోతిష్యం డిపార్ట్మెంట్ ఇంచార్జి డా. బీవీ సత్యనారాయణ,జ్యోతిషం,జర్నలిజం విద్యార్థులు కొండూరి కోటిబాబు, నరేష్, సిహెచ్. హరీష్, కళ్యాణ్ దాస్,నాగుల అంజిబాబు, ప్రశాంత్, నదియా, లీలావతి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## పోలుమల్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగుల పంపిణీ

**మద్దిరాల (క్రైమ్ మిర్రర్):** నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పోలుమల్ల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఎం శ్రీ ఎంపీపీఎస్ పోలుమల్ల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. 20వేల రూపాయల విలువైన 100 స్కూల్ బ్యాగులను విద్యార్థులకు అందజేసి వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకొని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సామాజిక సేవలో భాగంగా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జహీర్ గ్రామ పెద్దలు, క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఆలయ కమిటీ ఆహ్వానంతో హాజరైన ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఆలయ కమిటీ ఆహ్వానంతో హాజరైన ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

**బాలానగర్, జూన్ 29 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడలో వెలసిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి బొడ్రాయి పండుగ తొలి వార్షికోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవారికి విశేష పూజలు, హోమాలు, మంగళహారతులు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధి కలగాలని ప్రార్థించారు. ఈ



సందర్భంగా మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఇటువంటి దేవాలయ ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజల్లో ఐక్యత, పరస్పర సహకారం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మత్స్యకారుల కమిటీ ఉపాధ్యక్షుడు, బాలానగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల నరేందర్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన ఈ తొలి వార్షికోత్సవం ఫిరోజ్‌గూడ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## అగ్రి వర్సిటీ క్వార్టర్స్ లో ఉంటున్న పోలీస్ అధికారులని ఖాళీ చేయించవలసిందిగా డీ జీ పీ కి ఉప కులపతి వినతి

**గండిపేట(క్రైం మిర్రర్):** గత 4-5 ఏళ్ల నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని ఉన్నతాధికారుల క్వార్టర్స్ లో నివసిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులని వెంటనే ఖాళీ చేయించవలసింది గా ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య డీజీపీ కి విజ్ఞప్తి చేశారు. ఆయన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తో కలిసి డీజీపీ తో సమావేశం అయి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయంలో గత 60 ఏళ్ల క్రితం నిర్మించిన క్వార్టర్స్ లో విశ్వ విద్యాలయానికి చెందిన చీఫ్ వార్డెన్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్స్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, డైరక్టర్ ఆఫ్ రీసెర్చ్ తదితర ఉన్నతాధికారులు ఆ క్వార్టర్స్ లోనే నివసించి విద్యార్థుల భద్రత, సంక్షేమం, క్రమశిక్షణ అంశాలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయం లోని కీలక పదవులు కొంతకాలం ఖాళీ గా ఉన్నందున ఆనాటి విశ్వవిద్యాలయ యాజమాన్యం పోలీస్ అధికారుల అభ్యర్థన మేరకు క్వార్టర్స్ ని తాత్కాలికం గా కేటాయించే సమయం లోనే విశ్వవిద్యాలయం ఎప్పుడు ఖాళీ చేయమంటే అప్పుడు ఖాళీ చేస్తామన్న నిబంధనతోనే పోలీస్ అధికారులు క్వార్టర్స్ లోనికి ప్రవేశించారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయానికి పూర్తి స్థాయి ఉప కులపతి తో పాటు రిజిస్ట్రార్, డీన్స్, డైరక్టర్స్ సహా ఎనిమిది మంది ఉన్నతాధికారులని జనవరి 2025 లోనే నియమించారు. అనంతరం విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల నివాసం కోసం క్వార్టర్స్ ని ఖాళీ చేయవలసింది గా విశ్వవిద్యాలయం పోలీస్ ఉన్నతాధికారులని కోరింది. వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం తో విశ్వ విద్యాలయం వారికి అనేక సార్లు నోటీసులు ఇచ్చింది. ప్రభుత్వం దృష్టి కి కూడా విషయాన్ని తీసుకెళ్లారు. ఆగస్టు 2025 లో



నాటి డీజీపీ క్వార్టర్స్ ని తక్షణమే ఖాళీ చేసి అన్ని రకాల బకాయిలని విశ్వవిద్యాలయానికి చెల్లించవలసింది గా నోటీసులు పంపారు. అయినా నేటి వరకూ పోలీస్ అధికారుల నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఈ నెల 16 వ తేదీన వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశం లో ఈ అంశాన్ని ఉప కులపతి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి దృష్టి కి తీసుకొని వెళ్లారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ క్వార్టర్స్ లో ఉంటున్న పోలీస్ అధికారులని తక్షణమే ఖాళీ చేయించవలసింది గా ముఖ్యమంత్రి తన కార్యాలయాన్ని ఆదేశించారు. అదే విషయాన్ని ఉప కులపతి,రిజిస్ట్రార్ లు నూతనం గా డిజీపీ గా నియమితులైన సి.వి.ఆనంద్ ని మర్యాద పూర్వకం గా కలసి ఈ విషయాన్ని వారి దృష్టి కి తీసుకొని వెళ్లారు. త్వరలోనే పోలీస్ అధికారులు ని విశ్వవిద్యాలయం క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు.




## కళాశాలలో కనీస వసతులకై కలెక్టర్ కు ఫిర్యాదు....!

**జగిత్యాల జిల్లా బ్యూరో(క్రైమ్ మిర్రర్)** మేడిపెల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు సరిగా లేవని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. జూనియర్ కళాశాలలోని విద్యార్థులు పడుకునే డార్మెటరి హాల్ లో కనీస సౌకర్యాలైన తలుపులు,కిటికీలు లేవని మంచాలు తుప్పుపట్టి వంగిపోయి విద్యార్థులు పడుకోవడానికి వీలు లేకుండా ఉన్నాయని తెలిపారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి గురుకులాలు,మోడల్ స్కూల్స్,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరిట వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. మంత్రుల కొడుకులు ముఖ్యమంత్రి కొడుకు ఇలాంటి స్కూల్స్ లోనే చదువుతున్నారా అని ప్రశ్నించారు. వసతి గృహానికి తలుపులు, కిటికీలు లేనందున ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాములు,తేళ్లు,జెర్రులు ఇతర విష పురుగులు ప్రవేశించే అవకాశం ఉందని దానివల్ల విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గతంలో ఇలాంటి ఘటనలు జరిగి పదుల సంఖ్యలో విద్యార్థులు మృతిచెందిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు. వారం రోజుల్లోగ విద్యార్థులకు మెరుగైన కనీస సౌకర్యాలు సమకూర్చనట్లయితే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎస్పీ

**భద్రాద్రి కొత్తగూడెం జూన్ 29:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ సమీపంలోని నవభారత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనా న్ని, ఎస్పీ క్యాంప్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఇంజినీ ర్లతో మాట్లాడిన ఎస్పీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్బి 2 ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్, ఆర్ ు బీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.



# భట్రాజుల ఐక్యతను చాటి చెబుదాం

## హ్యాట్రిక్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు

## ఘనంగా రాష్ట్ర నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

## 2027 ఫిబ్రవరిలో రాష్ట్ర మహాసభల నిర్వహణకు కార్యవర్గం తీర్మానం






కూకట్ పల్లి, జూన్ 29 (క్రైమ్ మిర్రర్): హైదరాబాద్‌లోని ఇంజాపూర్‌లో గల తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘ భవనంలో తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం (2026--2029) నూతన కార్యవర్గ తొలి సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి ఇటీవల ఎన్నికైన కేంద్ర కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరై, సంఘ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హ్యాట్రిక్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని భట్రాజు కులస్తులు అన్ని రంగాల్లో ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా చట్టసభలు, సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో భట్రాజు సమాజం తన ఐక్యతను చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో 2027 ఫిబ్రవరి నెలలో తెలంగాణ రాష్ట్ర భట్రాజు మహాసభలను ఘనంగా నిర్వహించాలని కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మహాసభలకు తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం గౌరవ అధ్యక్షుడు, ట్రస్ట్ చైర్మన్ కూరపాటి భూపతిరాజును మహాసభ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు మహిళా, యువజన తదితర అనుబంధ సంఘాల కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నియమించిన తెలంగాణ భట్రాజు ఫెడరేషన్ చైర్మన్ చక్రహరి బాలరాజు సహకారంతో సంఘ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని తీర్మానించారు. దేవరాజు విష్ణువర్ధన్ రాజు మాట్లాడుతూ, అట్టడుగు స్థాయిలో ఉన్న పేద భట్రాజు కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయడంతో పాటు, ఫెడరేషన్‌కు కేటాయించే నిధులను సమర్థవంతంగా వినియోగించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు మాట్లాడుతూ, త్వరలోనే రాష్ట్ర మహిళా, యువజన సంఘాల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ చక్రహరి విద్యాధర్ భట్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల బాధ్యులు కేశిపెద్ది నర్సింహా రాజు, చక్రాల రేవతి నంద్, కాసు విశ్వేశ్వర్ రాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర భట్రాజు సంఘం నూతన కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, కోశాధికారి సరికొండ రామరాజు, సహ అధ్యక్షులు వ్యాసభట్టు వెంకట రమణ రాజు, అంబటి బాపిరాజు, చెన్నామాధవుని జీవన్ రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరపాటి రంగరాజు, ఆర్. కే. యం. రాజు, కూరపాటి సుశీల, రాష్ట్ర అధికార ప్రతినిధి బొల్లేపల్లి సీతారామరాజు,సంయుక్త కార్యదర్శి బ్రహ్మాండభేరి గోపరాజు లతోపాటు, ఈ కార్యక్రమంలో మాజీ మహిళా అధ్యక్ష కార్యదర్శులు ప్రతికంఠం హేమలత, ప్రతికంఠం సావిత్రి,రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కుల బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గంలోకి పలువురిని ఏకగ్రీవంగా నియమిస్తున్నట్లు సంఘం ప్రకటించింది.

# ఎన్యూమరేషన్ ఫారం సమర్పిస్తేనే ముసాయిదా ఓటరు జాబితాలో పేరు నమోదు

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 29:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు పంపిణీ చేసే ఎన్యూమరేషన్ ఫారాలను ప్రతి ఓటరు పూర్తిగా నింపి తిరిగి సమర్పిస్తేనే వారి పేరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. బీఎల్‌వోలు స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, ఈ బాధ్యతలను ఇతరులకు అప్పగించరాదని స్పష్టం చేశారు. సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బీఎల్‌వోల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లకు సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన 1950 హెల్ప్‌లైన్, కలెక్టరేట్, ఈఆర్వో కార్యాలయాల్లోని హెల్ప్‌డెస్క్‌ల వివరాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విధుల నిర్వహణ సమయంలో బీఎల్‌వోలు ఎన్నికల సంఘం అందజేసిన టీ-షర్ట్, క్యాప్, ఐడీ కార్డు, బ్యాగ్‌ను తప్పనిసరిగా ధరించాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని పేర్కొన్నారు.కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 55 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందన్నారు. వంద శాతం ఫారాల పంపిణీ, సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓలు రాజేందర్, రమేష్, వెంకటేశం, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎల్ కాలనీలో పర్యటించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి




అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 29: బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎన్ఎస్-ఎల్ కాలనీలో అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి సోమవారం పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో పాటు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న శశిధర్ రెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సతన్న, శర్మ, సురేష్ నాయక్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మభూషణ్ డా. నోరి దత్తాత్రేయుడిని ఘనంగా సత్కరించిన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు



**గండిపేట(క్రైం మిర్రర్):** దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మభూషణ్ అవార్డును అందుకున్న ప్రపంచ ప్రఖ్యాత భారతీయ-అమెరికన్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా. నోరి దత్తాత్రేయుడని మెడికవర్ హాస్పిటల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మెడికవర్ ఆంకాలజీ విభాగానికి చెందిన సీనియర్ వైద్యులు, నిపుణులు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. సన్మాన కార్యక్రమం అనంతరం క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతికత, భారతదేశంలో ఆంకాలజీ రంగ భవిష్యత్, ప్రతి రోగికి నాణ్యమైన క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరంపై డా. నోరి వైద్య బృందంతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సెంటర్ హెడ్ డా. ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ "డా. నోరి దత్తాత్రేయుడు ప్రపంచ స్థాయి వైద్య విజ్ఞానాన్ని భారతదేశానికి తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి క్యాన్సర్ వైద్య రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు పద్మభూషణ్ పురస్కారం అత్యంత సముచిత గౌరవం ఆయన ప్రయాణం యువ వైద్యులకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. మెడికవర్ ఆంకాలజీ కన్సల్టెంట్ డా. రిగ్వేద్ నిట్టాల మాట్లాడుతూ వైద్య జీవితం ప్రతి ఆంకాలజిస్టుకు ఆదర్శం, రోగి కేంద్రిత వైద్య సేవలు ఎలా ఉండాలో ఆయన చూపిన మార్గం మాకు స్ఫూర్తినిస్తుంది. ఆయనతో జరిగిన చర్చ మా బృందానికి ఎంతో విలువైన అనుభవంగా నిలిచింది అని తెలిపారు. డా. నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ హైదరాబాద్ నాకు ఎప్పుడూ ప్రత్యేకమైన నగరం ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్స ప్రతి రోగికి అందుబాటులోకి రావాలన్నదే నా లక్ష్యం మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్య బృందం అందించిన ఈ గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఆంకాలజీ విభాగానికి చెందిన డా. మాధాల రవికృష్ణ (మెడికల్ ఆంకాలజిస్ట్)తో పాటు సీనియర్ కన్సల్టెంట్లు, వైద్యులు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పి ఎస్ ఆర్ కే భగవాన్



**కూకట్ పల్లి, జూన్ 29 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా పి ఎస్ ఆర్ కె భగవాన్ నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కే సురేష్ కుమార్, ఏ రఘునాథ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా ఏ రామశేషగిరిరావు, కోశాధికారిగా టి మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఏ వీరేశప్ప, జి నాంచారయ్య, కార్యవర్గ సభ్యులుగా శ్రీకృష్ణమోహన్, భువన ప్రసాద్, జీవి సాగర్, కె ఎన్ ఎం శ్రీనివాస్, ఎం దాసిరెడ్డి, జయ జ్యోతిర్మయి, సుబ్బారెడ్డి, డాక్టర్ సూర్య ప్రకాష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పీఎస్ఆర్కే భగవాన్ మాట్లాడుతూ వడ్డేపల్లి ఇంట్లో ఓనర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా తనకు మరో అవకాశం కల్పించి నందుకు సంక్షేమ సంఘం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. అలాగే కాలనీవాసులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


## బీడీఎల్ కాలనీ సమస్యలపై ఆదర్శ్ రెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ జూన్ 29:** పటాన్‌చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి స్థానికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఇంజినీరింగ్ ఏఈ శివతో కలిసి బీడీఎల్ కాలనీ నుంచి రాయసంద్రం చెరువు వరకు ప్రాంతాన్ని సందర్శించారు. రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవించి కాలనీలోకి వచ్చి స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని నివాసితులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆదర్శ్ రెడ్డి, ముఖ్యంగా వారాంతాల్లో పోలీసు శాఖ తరచూ పెట్రోలింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. అలాగే ప్రజల భద్రత, అక్రమ కార్యకలాపాల నియంత్రణ కోసం సంబంధిత ప్రాంతంలో కంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీడీఎల్ కాలనీ సొసైటీ డైరెక్టర్లు రమేష్, విఠల్ రెడ్డి, పాషా, మహిళలు, స్థానిక నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

## భట్రాజు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా కూరపాటి కరుణాకర్ రాజు నియామకం



**కుత్బుల్లాపూర్ , జూన్ 29 క్రైమ్ మిర్రర్):** భట్రాజు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా మేడ్చల్ జిల్లా పశ్చిమ శాఖ అధ్యక్షుడు కూరపాటి కరుణాకర్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో కూరపాటి కరుణాకర్ రాజును రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా భట్రాజు సంఘ అభ్యున్నతి కోసం తాను నిరంతరం సేవలందిస్తున్నానని, తన సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొంటూ, భవిష్యత్తులో భట్రాజు కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, సంఘ సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# చింతా ప్రభాకర్‌కు నిర్మలా జగ్గారెడ్డి కౌంటర్..
# సభలో రాజకీయ వేడి

బీఆర్ఎస్ అప్పులపైనే కాంగ్రెస్ విమర్శలు

హామీల అమలుపై సభలో మాటల యుద్ధం

'తవ్వుకుంటే పాత చిట్టా బయటపెడతాం'

పోతిరెడ్డిపల్లి సభలో రాజకీయ వేడి

కళ్యాణలక్ష్మి వేదికగా రాజకీయ విమర్శలు

హామీలపై కాంగ్రెస్--బీఆర్ఎస్ వాగ్వాదం

గత పాలనపై నిర్మలా జగ్గారెడ్డి విమర్శలు



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 29:** సంగారెడ్డి నియోజకవర్గంలోని పోతిరెడ్డిపల్లిలో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మధ్య రాజకీయ వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి.కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. దీనికి స్పందించిన నిర్మలా జగ్గారెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుకుంటూనే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే, "హామీల గురించి తవ్వుకుంటూ పోతే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలను కూడా ప్రస్తావించాల్సి వస్తుంది" అంటూ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు నిర్మలా జగ్గారెడ్డి వేదికపైనే ఘాటుగా ప్రతిస్పందించారు. దీంతో సభలో కొద్దిసేపు రాజకీయ వేడి నెలకొంది.




## వర్షాకాల ముందస్తు జాగ్రత్తలు

**హిమాయత్‌సాగర్ డ్యామ్‌ను పరిశీలించిన రాజేంద్రనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్**

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రస్తుత వర్షాకాల ముందస్తు జాగ్రత్తలలో భాగంగా సోమవారం రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ హిమాయత్‌సాగర్ డ్యామ్, దాని పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్, డ్యామ్‌కు సంబంధించిన జలవనరుల అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా ప్రతి సంవత్సరం ముందస్తుగా, ఆనవాయితీగా స్థానిక రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఒక ఫీట్ మేర గేటును పైకి లేపి నీటిని కిందకు వదలడం జరుగుతుంది. ఈ ఆనవాయితీని అనుసరిస్తు ఈ నెల 28వ తేదీన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హిమాయత్‌సాగర్ గేటును ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో డీసీపీ శ్రీనివాస్ స్పందిస్తూ అకాల వర్షాల కారణంగా ఒక వేళ డ్యామ్ పూర్తిస్థాయిలో నిండినట్లయితే మొత్తం 17 గేట్లను ఎత్తి నీటిని వదలాల్సి వస్తుందన్నారు. అలా గేట్లు పూర్తి స్థాయిలో ఎత్తినప్పుడు డ్యామ్ చుట్టు పక్కల నివసిస్తున్న ప్రజలకు, ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాలలో తలెత్తే ట్రాఫిక్, ముంపు సమస్యలను ఆయన అధికారులతో కలిసి నిశితంగా పరిశీలించారు. వరద నీటి ఉదతి వల్ల ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేదా హానీ జరగకూడదనే భావనతో, ముందస్తుగా తీసుకోవలసిన భద్రతా జాగ్రత్తలను డిసిపి అధికారులందరికీ క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాలలో, రోడ్లపై సరైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు, జలవనరుల శాఖల సమన్వయంతో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

## ప్రజావాణికి 19 అర్జీలు

**భూ సంబంధిత సమస్యలే అధికం**

**సత్వర పరిష్కారానికి అధికారులకు ఆర్డీఓ ఆదేశాలు**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూన్ 29: మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణికి మొత్తం 19 ఫిర్యాదులు అందాయి. వీటిలో మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయానికి 10, తహసీల్దార్ కార్యాలయానికి 6, మాడ్గులపల్లి తహసీల్దార్ కార్యాలయానికి ఒకటి, పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయానికి 2 ఫిర్యాదులు వచ్చాయి.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూ సంబంధిత, పంపిణీ తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, డీఎల్‌పీఓ రాఘవరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు కె. జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీఓ ఎం. ఋష్యేంద్రమణి, మున్సిపల్ మేనేజర్ జి. జ్ఞానేశ్వరి, ఐసీడీఎస్ అర్బన్ పీఓ వేణుగోపాల్, ఉద్యానవన శాఖ అధికారి నసీమా మెహ్రిన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నిర్లక్ష్యానికి నిదర్శనమా?
## పిల్లల భద్రత ప్రశ్నార్థకం..!!

**గుడ్ మార్నింగ్ స్కూల్ బస్‌పై స్థానికుల ఆరోపణలు**

**ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రశ్నలు**

**డ్రైవర్ల అనుభవం, భద్రతా ప్రమాణాలపై చర్చ**






**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. మండలంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన "గుడ్ మార్నింగ్" స్కూల్ బస్ అతివేగంగా వచ్చి ఓ యువకుడిని ఢీకొట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించారు. స్థానికుల కథనం ప్రకారం, బస్ సాధారణ వేగం కంటే ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న ప్రజలు గాయపడిన యువకుడికి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సుల భద్రతా ప్రమాణాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు సక్రమంగా ఉన్నాయా?, నిర్దిష్ట కాల వ్యవధిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా?, వాహనాలు నిబంధనలకు అనుగుణంగా నడుస్తున్నాయా? అనే అంశాలపై చర్చ జరుగుతోంది. అలాగే విద్యార్థుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు తగిన అనుభవం, శిక్షణ ఉందా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పాఠశాల యాజమాన్యాలు డ్రైవర్ల నియామకంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రమాద ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, ప్రమాదానికి గల కారణాలను వెలికితీయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మండలంలోని అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అర్హతలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.



## బొక్కలగుట్టలో దారుణం

**పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య!**

**రామకృష్ణాపూర్,జూన్ 29 (క్రైమ్ మిర్రర్):** పాతకక్షలు,కుటుంబ వివాదాల నేపథ్యంలో బంధువునే సిమెంట్ రాయితో తలపై బాది దారుణంగా హత్య చేసిన ఘటన రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జి వెంకటేష్ అలియాస్ స్వామి (40), అదే గ్రామానికి చెందిన ఒద్దెపల్లి రాజ్‌కుమార్ అలియాస్ కుమార్ (28) మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి.సుమారు ఆరేళ్ల క్రితం రాజ్‌కుమార్ వెంకటేష్ మేనకోడలిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయగా, పెద్దల సమక్షంలో వెంకటేష్ జోక్యం చేసుకుని ఇద్దరికీ వివాహం జరిపించాడు. అప్పటి నుంచి వెంకటేష్‌పై రాజ్‌కుమార్ కక్ష పెంచుకున్నట్లు తెలిసింది. ఆదివారం రాత్రి పాడైన మొబైల్ ఫోన్ విషయమై మరోసారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో చొప్పరి శ్రీను ఇంటి సమీపంలో రాజ్‌కుమార్ సిమెంట్ రాయితో వెంకటేష్ తలపై బలంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడికి భార్య లావణ్య, కుమారులు రిషి వర్మ, శశి వర్ధన్ ఉన్నారు. సమాచారం అందుకున్న మందమర్రి సీఐ పర్స రమేష్, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు.పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు,తెలిపారు.

## ప్రైవేట్ ఆస్పత్రులపై ఉక్కుపాదం

**30 ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు**

**సెల్లార్లలో నడుస్తున్న రెండు డయాగ్నస్టిక్ సెంటర్లు సీజ్**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో**

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూన్ 29: నిబంధనలను ఉల్లంఘించే ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ హెచ్చరించారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక బృందంతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లను లక్ష్యంగా చేసుకుని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో లైసెన్స్‌లను పునరుద్ధరించకుండా వైద్యసేవలు అందిస్తున్న 30 ప్రైవేట్ ఆస్పత్రులను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ భవనాల సెల్లార్లలో నిర్వహిస్తున్న రెండు ప్రముఖ డయాగ్నస్టిక్ సెంటర్లను అక్కడికక్కడే సీజ్ చేశారు. సెల్లార్లలో ల్యాబ్‌లు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని, రోగుల భద్రతతో రాజీపడితే సహించబోమని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు.కొద్ది రోజుల క్రితమే మిర్యాలగూడలోని ఓ ప్రముఖ నర్సింగ్ హోంలో అక్రమ గర్భస్రావాల ఆరోపణలపై తనిఖీలు నిర్వహించిన అధికారులు, మూడు రోజుల వ్యవధిలోనే మరోసారి ప్రైవేట్ ఆస్పత్రులపై దాడులు చేపట్టడం చర్చనీయాంశమైంది.గతంలోనూ రాష్ట్ర మెడికల్ విజిలెన్స్ బృందం అనుమతులు, అర్హతలు లేకుండా నడుస్తున్న ఆస్పత్రులను సీజ్ చేసింది. అయినప్పటికీ అక్రమాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈసారి తనిఖీలతో పాటు కఠిన చర్యలు అమలవుతాయా లేదా అన్నది కొద్ది రోజుల్లో తేలనుంది.తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వోతో పాటు పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# 1191 సర్వేనెంబర్ భూమి కబ్జాపై గ్రీవెన్స్‌లో వినతి

### నేలకొండపల్లిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ.. కలెక్టర్, మంత్రి పొంగులేటి విచారణకు ఆదేశించాలి

### హైడ్రా తరహాలో కూల్చివేతలు చేపట్టి స్వాధీనం చేసుకోవాలి.. లేదంటే ఎస్సీ, బీసీ విలేకరులకు ప్లాట్లు ఇవ్వాలి: భక్త రామదాసు ప్రెస్ క్లబ్



**క్రైమ్ మిర్రర్ పాలేరు :** నేలకొండపల్లి, నేలకొండపల్లి మండలంలో 1191 సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమి యథేచ్ఛగా కబ్జాకు గురైందని, తక్షణమే ఉన్నతస్థాయి విచారణ జరిపి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి లో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు రికార్డుల్లో ప్రభుత్వ భూమి: రెవెన్యూ రికార్డుల ప్రకారం 1191 సర్వేనెంబర్ భూమి పూర్తిగా ప్రభుత్వ భూమి. అధికారులు కూడా దీనిని గతంలో ధ్రువీకరించారు.వెలిసిన అక్రమ కట్టడాలు: అయితే ప్రస్తుతం ఆ భూమిలో పక్కా ఇళ్లు, ఇతర శాశ్వత నిర్మాణాలు వెలిశాయి. రిజిస్ట్రేషన్లు జరిగాయి. గ్రామ పంచాయతీ ఇంటి నంబర్లు మంజూరు చేసింది. ఏకంగా సీసీ రోడ్లు కూడా నిర్మించారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలకు అనుమతులు ఎవరిచ్చారు? రిజిస్ట్రేషన్ శాఖ ఎలా అనుమతించింది? పంచాయతీ అధికారులు ఇంటి నంబర్లు ఎలా కేటాయించారు?

**ప్రెస్ క్లబ్ స్పష్టమైన డిమాండ్లు**

భక్త రామదాసు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో హైడ్రా ద్వారా ప్రభుత్వ భూముల్లోని అక్రమ కట్టడాలను కూల్చివేసి స్వాధీనం చేసుకుంటున్నారు. అదే విధానాన్ని నేలకొండపల్లిలోని 1191 సర్వేనెంబర్ భూమి విషయంలోనూ అమలు చేయాలి. జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించాలి" అని కోరారు.

**ప్రత్యామ్నాయ ప్రతిపాదన**

"ఒకవేళ ప్రభుత్వం పరిపాలనాపరమైన కారణాలతో ఆ భూమిని స్వాధీనం చేసుకోలేని పక్షంలో, స్థానికంగా నివాసం ఉంటున్న ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన విలేకరులకు ఆ భూమిని ప్లాట్లుగా కేటాయించి సామాజిక న్యాయం చేయాలి" అని వినతిపత్రంలో ప్రెస్ క్లబ్ స్పష్టం చేసింది.ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన సబ్ రిజిస్ట్రార్, అనుమతులు ఇచ్చిన, ఇంటి నంబర్లు మంజూరు చేసిన పంచాయతీ కార్యదర్శి వంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ డిమాండ్ చేసింది.ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో తేల్చే పరీక్ష ఇది. 1191 సర్వేనెంబర్ వ్యవహారంలో వాస్తవాలు బయటకు తీసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే సామాన్య ప్రజలకు వ్యవస్థపై నమ్మకం కలుగుతుందని నేలకొండపల్లి వాసులు అభిప్రాయపడుతున్నారు.

# వర్షాల నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ వాయిదా..

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

### రైతు భరోసా పంపిణీ అనంతరం ఘనంగా రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తాం

### రైతు సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం..

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈనెల 30న చింతకాని మండలం జగన్నాథపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడాతూ వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవనున్న రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు.రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు. తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు. రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని,మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు.యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, ఈ పాలనలో తెలంగాణలో రైతు రాజ్యం సాకారమై దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డిఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్29: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముంబయి చేరుకున్నారు. గత కొంతకాలంగా భుజాలకి సంబంధించిన రొటేటర్ కఫ్ గాయం, రెండు భుజాలకి చెందిన కండరాలు పూర్తిగా చిట్లడంతో ఆయన ఇబ్బందిపడుతున్నారు. దీంతో వైద్య పరీక్షల నిమిత్తం ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రికి పవన్ వెళ్లనున్నారు. పవన్‌కల్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల ఉన్నారు.



## కార్యదర్శిపై అవినీతి ఆరోపణల విచారణ

### కొండ్రపోల్ పంచాయతీలో రూ.19 లక్షల దుర్వినియోగం జరిగిందన్న ఫిర్యాదు

### నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తాం: డీఎల్‌పీఓ

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూన్ 29: మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎల్. శారదపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) రాఘవరావు సోమవారం విచారణ నిర్వహించారు.15వ ఆర్థిక సంఘం (ఫైనాన్స్ కమిషన్) నిధుల్లో రూ.19 లక్షలను సైబర్ విధానంలో దుర్వినియోగం చేశారంటూ ప్రస్తుత సర్పంచ్ పగిడి రాధ--రాంలింగయ్య ఈ నెల 19న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా డీఎల్‌పీఓ రాఘవరావును నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో గ్రామంలో విచారణ చేపట్టారు.ఫిర్యాదు ప్రకారం, చెరువు పూడికతీత పనులు చేపట్టకుండా, సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా ఓటీపీని వినియోగించి రూ.19 లక్షలు మూడు విడతల్లో డ్రా చేసినట్లు ఆరోపించారు. అలాగే ప్రత్యేక అధికారుల పాలనలోనూ నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదులోని అన్ని అంశాలపై విచారణ చేపట్టామని, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని డీఎల్‌పీఓ రాఘవరావు తెలిపారు.

## గాదె సాయికృష్ణ మృతి కేసు

### లొంగిపోయిన హెడ్ కానిస్టేబుళ్లు

విజయవాడ: గాదె సాయికృష్ణ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న అశోక్, నాని సూర్యారావుపేట ఏసీపీ కార్యాలయానికి వచ్చి లొంగిపోయారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజుకు వీరిద్దరూ వెన్నంటి ఉండేవారు. సాయికృష్ణ మృతి వ్యవహారంలో అశోక్, నాని ఆయనకు సహకారం అందించినట్లు సిట్ గుర్తించింది. నాగరాజు అరెస్ట్ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన వారిద్దరూ నేడు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కృష్ణలంక స్టేషన్ పరిధిలోని బార్లు, మద్యం దుకాణాలు, లాడ్జీలు.. ఇతరత్రా కార్యకలాపాలకు సంబంధించిన వ్యవహారాలను అశోక్ చక్కదిద్దేవాడు. పలు సెటిల్మెంట్లకు పాల్పడేవాడని ఆరోపణలున్నాయి. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులతో సఖ్యంగా ఉండటం, బెదిరింపులకు పాల్పడటం, నేరస్థులను స్టేషన్‌కు తీసుకురావడం వంటి పనులను నాని చేసేవాడు. నాని పటమట స్టేషన్‌లో పనిచేసినప్పుడు స్పా సెంటర్ల విషయంలో ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపించారు. గన్నవరం స్టేషన్‌లో పనిచేసినప్పుడు ఓ మిస్సింగ్ కేసులో ఆత్కూరు స్టేషన్ ఎస్సైని అని చెప్పి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెండయ్యాడు. సీఐ నాగరాజుకు సన్నిహితంగా మెలిగిన ప్రైవేటు వ్యక్తి సురేష్ కూడా వీరితో కలిసి రౌడీషీటర్ల కౌన్సెలింగ్, నిందితుల విచారణ, తదితర వ్యవహారాల్లో జోక్యం చేసుకునేవాడని తేలింది. గత నెల 29న సాయికృష్ణ బంధువులను కలిసేందుకు ఈ ముగ్గురూ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం వెళ్లారని సిట్ అధికారులు గుర్తించారు. సురేష్‌ను సిట్ ఇప్పటికే అదుపులోకి తీసుకుంది.

## మోడీ నేతృత్వంలో విశ్వగురుగా భారత్

### బిజెపి బూత్ అధ్యక్షుల భేటీలో నితిన్ నబీన్




హనుమకొండ: ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ విశ్వగురుగా ఎదుగుతోందని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. పన్నెండేళ్ల మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారని చెప్పారు. హనుమకొండలో భాజపా బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కల సాకారం కావడంలో భాజపా సహకారం ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సుష్మాస్వరాజ్ ఎంతో కృషి చేశారని చెప్పారు. 'ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరగకుండా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు. జన్‌ధన్ ఖాతాలు ఇచ్చి ప్రభుత్వ సొమ్మును నేరుగా పేదల ఖాతాల్లో జమ చేస్తున్నారు. దేశంలోని 80 కోట్ల పేద కుటుంబాలకు ఆయుష్మాన్ భారత్ వర్తింపజేశారు. దేశ ప్రజలందరికీ ఉచితంగా కొవిడ్ టీకా ఇచ్చిన ఘటన మోదీకి దక్కింది. సెమీ కండక్టర్ పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఏఐ టెక్నాలజీలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రధాని కృషి చేస్తున్నారు. వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించాలి. వరంగల్ ఖిల్లాపై కాషాయజెండా ఎగరాలి. విభజన రాజకీయాలు చేస్తున్నవారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. వరంగల్ బిడ్డ పీవీ నర్సింహారావుకు దిల్లీలో అవమానం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు సరైన గౌరవం కూడా ఇవ్వలేదు. పీవీ స్మారక నిర్మాణానికి సోనియాగాంధీ అంగీకరించలేదు' అని నితిన్ నబీన్ విమర్శించారు.


## 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధిపై ఉత్తర్వులు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు , వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కోసం అమలవుతున్న 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధి సమకూర్పుపై రాష్ట్ర ఆర్థిక శాఖ సరికొత్త ఉత్తర్వులను జారీ చేసింది. జీవో 79 ప్రకారం ఇకపై ప్రతి ఉద్యోగి మూల వేతనం లేదా పెన్షనర్ల మూల పింఛను నుండి ప్రతి నెలా 1.5 శాతం మొత్తాన్ని ఈ ఈహెచ్‌ఎస్ హెల్త్ ఫండ్‌కు విరాళంగా కట్ చేయనున్నారు. మే 2026 నెలకు సంబంధించిన జీతాలు, పెన్షన్ల నుంచే ఈ కోత పక్రియ ప్రారంభం కానుంది. ఈ నిధుల కోత విధానంలో ఉద్యోగులపై అదనపు భారం పడకుండా, ఎక్కడా డబుల్ కటింగ్ జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పుడు, లేదా వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి మరొకరు ప్రభుత్వ పెన్షనర్‌గా ఉన్నప్పుడు కేవలం ఒక్కరి జీతం నుండి మాత్రమే ఈ మొత్తాన్ని మినహాయిస్తారు.

# పులి-మేకతో రోజా రీ ఎంట్రీ




సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.



# వారణాసి స్టిల్స్ లీక్..జక్కన్న మౌనం

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

# దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.






# కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే ప్రక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది.



# నా చేయి పట్టుకో...



విశాల్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన తొలి సినిమా 'మకుటం'. దివంగత నిర్మాత ఆర్‌బీ చౌదరి సూపర్ గుడ్ ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలోని 99వ చిత్రం ఇది. ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటించారు. 'మకుటం' సినిమా జూలైలో విడుదల కానుంది. కాగా, ఈ చిత్రంలోని 'నచ్చాకే వచ్చారా..' సాంగ్ లాంచ్ ఈవెంట్ జరిగింది. 'నచ్చాకే వచ్చారా... వెచ్చంగా హత్తుకో గుండెల్లో పెట్టుకో..., నా చేయి పట్టుకో...' అంటూ 'నచ్చారే...' పాట సాగుతుంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్ స్వరకల్పనలో భువనచంద్ర సాహిత్యం అందించిన ఈ పాటను ప్రభ పాడారు. విశాల్ మాట్లాడుతూ-- "శివ' సినిమా చూసిన తర్వాత దర్శకుడిగా మారాలని ఫిక్స్ అయ్యాను. 'మకుటం' చిత్రంతో నా ఆకాంక్ష నెరవేరింది. ఆర్‌బీ చౌదరిగారిని మిస్ అవుతున్నాను. ఆ నిర్మాణ సంస్థ నుంచి దర్శకుడిగా నేను 45వ వ్యక్తిని. సుబ్రహ్మణ్యంగారు నాపై పెట్టుకున్న నమ్మకంతోనే 'మకుటం' సినిమా ఈ స్థాయి వరకు వచ్చింది. మా నాన్న జీకే రెడ్డి గారి వల్లే నేను ఇక్కడ నిలబడగలిగాను. 'పందెం కోడి' మూవీని ఆయనే పట్టుబట్టి తెలుగులో రిలీజ్ చేశారు. 'మకుటం' చిత్రంతో ప్రేక్షకులు మంచి అనుభూతి పొందుతారు" అని పేర్కొన్నారు. "ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్ చేశాను" అన్నారు అంజలి. "వందో ప్రాజెక్ట్ అనేది మా నాన్నకి (ఆర్‌బీ చౌదరి) ఎంతో స్పెషల్. ఆయన లెగసీని కంటిన్యూ చేస్తూ, సినిమాలు నిర్మిస్తాం" అన్నారు జిత్తన్ రమేష్.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.